

నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సీహెచ్ వెంకటలక్ష్మి శిలీప్ దంపతులు (చెయ్యేరు) శుక్రవారం రూ.1,11,116 విరాళం అందజేశారు.



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కంచర్ల గోపాలరావు (రాయవరం మండలం చెల్లూరు) శుక్రవారం రూ.54 వేల విరాళం అందజేశారు.

డెల్టాలకు 12,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు 3,800, సెంట్రల్ 2,500, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఎస్సైలుగా ఎంపికైన ముగ్గురికి అభినందన



ఎస్సైలుగా ఎంపికైన ముగ్గురిని సత్కరించిన ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్, డీఎస్పీలు

అమలాపురం టౌన్: ఇటీవల ఎస్సై పోస్టులకు ఎంపికై న జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న ముగ్గురు పోలీసులు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుసారపు శ్రీధర్ నుంచి అభినందనలు అందుకున్నారు. జిల్లా ఏఎస్ఎస్ పార్టీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన ఆర్.శ్రీధర్, ఉప్పలగుప్తం గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న అదే మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన కుంచే శ్రీలత, రామచంద్రపురం పట్టణం బ్రాడిపేట వార్డు సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న అదే పట్టణానికి చెందిన మేడిశెట్టి లక్ష్మి సత్యవతిలను అభినందించి సత్కరించారు. జిల్లా ఎస్పీ శ్రీధర్‌తోపాటు ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.అంబికా ప్రసాద్, టీఆర్ఎస్‌కే ప్రసాద్, కె.వెంకటరమణ, జిల్లా ఎస్పీ సీఐ బి.రాజశేఖర్‌లు ఎస్సైలుగా ఎంపికై న ఆ ముగ్గురిని ఘనంగా సత్కరించారు. వారితోపాటు వారి తల్లిదండ్రులను కూడా అభినందించి సన్మానించారు. పోలీసు అధికారుల కుటుంబంలోకి వచ్చిన ఆ ముగురిని జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీ శ్రీధర్ ఆత్మీయంగా ఆహ్వానించారు.

ఓఎన్‌జీసీ పరిహారం అందజేయాలి



ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్‌ను కలిసిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు అందాల్సిన వేట నష్ట పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాకినాడ ఓఎన్‌జీసీ కార్యాలయంలో రత్నేష్‌కుమార్‌ను కలిసి నష్ట పరిహారం త్వరతగతిన విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట మత్స్యశాఖ అధికారి గొంతియ్య ఉన్నారు.

లోపాలతో పుట్టిన శిశువులను గుర్తించడం ఎలా?

ఆర్‌వోపీ సదస్సులో చర్చ



సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు

అమలాపురం టౌన్: లోపాలతో పుట్టిన శిశువులను తక్షణమే గుర్తించి వారికి అందించే వైద్య విధానాలపై అమలాపురం ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో గల డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్ (డైస్) భవనంలో రెటినోపతీ ఆఫ్ ప్రీమెచ్యూరిటీ (ఆర్‌వోపీ) సదస్సు శుక్రవారం జరిగింది.

తక్కువ బరువుతో శిశువులు పుట్టడం, హై రిస్కులతో పుట్టడం వంటి లోపాలపై ఈ సదస్సు చర్చించింది. ఈ సదస్సులో కంటి వైద్య పరంగా లేజర్ ట్రీట్‌మెంట్ ఎలా ఉండాలన్న అంశంపై చర్చ జరిగింది. పిల్లల్లో బరువును పెంచి వారి ఆరోగ్యాన్ని సరిచేసే వైద్య ప్రక్రియలపై కూడా సమీక్షించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందే వైద్య సహకారం కూడా వివరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి, డైస్ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ జాన్ లెవీ, రాజమహేంద్రవరం గౌతమి కంటి ఆస్పత్రి వైద్యునితో నియమితమైన కమిటీ ఆర్‌వోపీ వైద్యంపై అధ్యయనం చేస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. సదస్సులో డైట్ సెంటర్ ఆప్టోమెట్రిస్ట్ దేవకుమార్‌తోపాటు జిల్లాలోని 31 పీహెచ్‌సీలకు చెందిన మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

తగ్గిన నేరాలు..

పెరిగిన దిశ రిజిస్ట్రేషన్లు

- హత్య కేసులన్నింటినీ ఛేదించిన జిల్లా పోలీస్
- సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు
- జగనన్నకు చెబుదాం ద్వారా 772 కేసుల పరిష్కారం



జిల్లాలో ఈ సంవత్సరం జరిగిన నేరాల గురించి శుక్రవారం మీడియాకు వివరిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ, డీఎస్పీలు

అమలాపురం టౌన్: జిల్లాలో 2022 సంవత్సరంతో పోల్చుకుంటే 2023 సంవత్సరంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత సంవత్సరం కంటే 16 శాతం కేసులు తగ్గుముఖం పట్టాయి. కేసుల పరిష్కారం, ఆస్తుల రికవరీ, దిశ యాప్ రిజిస్ట్రేషన్ తదితర విషయాల్లో కూడా జిల్లా పోలీసులు ఈ సంవత్సరంలో ప్రగతి సాధించారు. 2022 సంవత్సరంలో జిల్లాలో 7,981 కేసులు నమోదు కాగా ఈ సంవత్సరంలో 6,696 కేసులు నమోదు అయ్యాయి. గత సంవత్సరంతో పోల్చితే 1,285 కేసులు తగ్గాయి. దిశ యాప్ రిజిస్ట్రేషన్లను ఎక్కువగా చేయించి జిల్లా ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో అనూహ్యమైన చైతన్యాన్ని తీసుకుని వచ్చినందుకు జిల్లా పోలీసు శాఖ ఈ ఏడాదిలో రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది. ఈ సంవత్సరం దిశ యాప్ ద్వారా 148 ఫిర్యాదులు అందుకుని అందులో 131 పరిష్కరించింది. ఈ సంవత్సరం జిల్లాలో 86,840 దిశ యాప్ రిజిస్ట్రేషన్లు చేయించింది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.అంబికాప్రసాద్, టీఎస్ఆర్‌కే ప్రసాద్, కె.వెంకటరమణ స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ సంవత్సరంలో జిల్లా పోలీసు శాఖ సాధించిన విజయాలను వివరించారు. గత సంవత్సరంతో పోల్చితే తగ్గిన నేరాల వివరాలను వెల్లడించారు.

చోరీ కేసుల్లోనూ తగ్గుదల

జిల్లాలో 2022లో 566 దొంగతనం కేసులు నమోదు కాగా 2023లో 525 కేసులు నమోదయ్యాయి. వీటిలో 288 కేసులను ఛేదించారు. చోరీ కేసుల్లో మొత్తం రూ.3,42,27,750 సొత్తు అపహరణకు గురికాగా అందులో రూ.1,61,35,264 విలువైన సొత్తును రికవరీ చేశారు. గత సంవత్సరంతో పోల్చితే 7 శాతం చోరీల సంఖ్య తగ్గింది.

హత్యకేసులు స్వల్పంగా పెరుగుదల

జిల్లా 2022 సంవత్సరంలో 16 హత్య కేసులు నమోదు కాగా 2023 సంవత్సరంలో 22 హత్యలు జరిగాయి. నమోదైన 22 కేసుల్లో 8 వివాహేతర సంబంధాలు, 4 కుటుంబ కలహాలు, 10 ఇతర కారణాలతో జరిగాయి. హత్య కేసులన్నింటినీ ఛేదించారు.



జిల్లాలో నేరాలు...పరిష్కారాలు ఇలా

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరంలో 780 ఫిర్యాదులు అందుకుని అందులో 772 కేసులను పరిష్కరించారు. 8 కేసులను పరిష్కరించాల్సి ఉంది.

- ప్రజలు పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన 602 కేసులకు సంబంధించి రూ.85.13 లక్షల విలువైన 602 సెల్ ఫోన్లను చాట్‌బాట్ ద్వారా రికవరీ చేశారు.
- డయల్ 100 ద్వారా 6,668 ఫిర్యాదులు స్వీకరించి అందులో 6,561 కేసులను పరిష్కరించారు.
- మహిళలు, బాలికలపై జరిగిన నేరాలకు సంబంధించి 12 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. జిల్లాలో ఇతర కేసులకు సంబంధించి మొత్తం 1,824 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి.
- ఎస్సీ, ఎస్టీ కేసులు గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం 39 తగ్గాయి. గత సంవత్సరం 99 కేసులు నమోదైతే ఈ ఏడాది 60 మాత్రమే నమోదు అయ్యాయి.
- ఈ సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు 638 జరిగాయి.

పోలీసు శాఖ తక్షణమే స్పందించిన ముఖ్య కేసులు

- ఆగస్టు 6వ తేదీన రావులపాలెం గౌతమీ వంతెనపై నుంచి ఉలవ సురేష్ అనే వ్యక్తి తన భార్యాబిడ్డలను గోదావరిలోకి గెంటేశాడు. ఈ ఘటనలో ఓ బాలిక వంతెనకు ఉన్న గొట్టాన్ని పట్టుకుని వేలాడి డయల్ 100కి ఫోన్ చేసి రావులపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఆ కాల్‌ను రిసీవ్ చేసుకున్న పోలీసులు తక్షణమే స్పందించి ఈ బాలికను సాహసంతో రక్షించి జిల్లా ప్రజలు ప్రశంసలు పొందారు.
- మార్చి 17న యానాం-ఎదుర్లంక వంతెనపై నుంచి ఓ మహిళ గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అటుగా వెళుతున్న జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ అంగాని వీరబాబు నదిలోకి దూకి ఆ మహిళను కాపాడాడు. పోలీసుల తక్షణ స్పందనను ప్రజలు గుర్తించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక సర్వే, కమిటీ

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక సర్వే చేయించారు. ఇందుకోసం పలువురు పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసి తరుచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించించారు. అలా గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలతో కూడిన ఏర్పాట్లు చేశారు. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

ముఖ్య దుర్ఘటనలు

- ఫిబ్రవరి 26: అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి విద్యార్థుల మృతి
- ఏప్రిల్-4: అమలాపురంలో మన్నే శ్రీదేవి అనే గృహిణిని హత్య చేసిన నెల్లూరు జిల్లాకు చెందిన సైకో
- సెప్టెంబర్-1: అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో రౌడీ షీటర్ పాలిశెట్టి కిషోర్ హత్య
- సెప్టెంబర్-1: ఆలమూరు మండలం జొన్నాడలో ఒక హిజ్రాను లైంగికంగా వేధించి కిరాతకంగా హత్య చేసిన నిందితులు
- జిల్లాలో ఎక్కువగా హౌస్ బ్రేకింగ్ నేరాలకు పాల్పడుతున్న షేక్ అజీజ్‌ను అరెస్ట్ చేసి అతను చేసిన 14 కేసులను ఛేదించి 240 గ్రాముల బంగారాన్ని, నాలుగు కేజీల వెండిని రికవరీ చేశారు. ఇలా జిల్లాలో ఏడు చోరీ కేసుల్లో భారీ రికవరీలు చేశారు.

సైబర్ నేరాల అదుపునకు

జిల్లాలో గత సంవత్సరం 37 సైబర్ నేరాలు నమోదు కాగా ఈ సంవత్సరం 97 కేసులు నమోదయ్యాయి. ఈ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో జిల్లాలో ప్రతీ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల కేవలం ఇవే కేసులపై స్పందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డయిల్ 1930 ద్వారా అందుకున్న 702 ఫిర్యాదులకు తక్షణమే స్పందించి రూ.14.27 లక్షలను ఆయా నష్టపోయిన ఫిర్యాదుదారులకు వివిధ బ్యాంక్‌ల్లో ఉన్న వారివారి అకౌంట్లలో తిరిగి జమ చేయించారు.

సమష్టి ప్రణాళికలతో నేరాలు తగ్గిస్తున్నాం



జిల్లాలోని అన్ని నేరాలకు సంబంధించి శాస్త్రీయ దృక్పథంతో లోతైన విచారణ, పరిశీలన చేస్తున్నాం. ప్రతీ అంశంలోనూ సమష్టి ప్రణాళికలతో నేరాల అదుపునకు చర్యలు చేపడతున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణలో చేసిన సర్వేలు, కమిటీల నివేదికలు సత్ఫలితాలు ఇచ్చాయి. చోరీలకు గురైన సొత్తులో రికవరీ కూడా ఉమ్మడి ప్రణాళికతోనే చేస్తున్నాం. నేరాల అదుపునకు జిల్లా ప్రజలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు.

– సుసారపు శ్రీధర్, జిల్లా ఎస్పీ

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు జేసీ నుపూర్ అజయ్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: త్వరలో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లు, డీఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధత చర్యలపై జిల్లాల వారీగా సమీక్షించారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ శాశ్వత వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపుపై దృష్టి సారించి నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి అధికారుల ఖాళీలపై ఆరా తీశారు. పోలింగ్ మెటీరియల్ డిస్పాచ్ రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లను, చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 1,644 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రిసైడింగ్ అధికారులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కోసం భవనాలు ఎంపిక చేయాలన్నారు. దివ్యాంగ ఓటర్ల వివరాలు, ఒకే డోర్ నంబర్‌లో 10 ఓట్లు మించి ఉన్నవారికి వేరే డోర్ నంబర్ కేటాయించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారులు ఆర్డీవోలు ఎం.ముక్కంటి, జి.కేశవవర్ధనరెడ్డి, ఎస్.సుధాసాగర్, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మదనమోహన్ రావు, పి గన్నవరం తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా



కడపలో జిల్లా ప్రాజెక్టులకు రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, పాఠశాల విద్యార్థిని

- దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలకు 3 ప్రాజెక్టులు ఎంపిక
- జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం వెల్లడి

అమలాపురం రూరల్: జిల్లాకు చెందిన మూడు పాఠశాలలకు చెందిన ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం శుక్రవారం వెల్లడించారు. కడపలో గురు, శుక్రవారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఇవి ఎంపికయ్యాయని ఆయన కడప నుంచి ఫోన్ ద్వారా తెలిపారు. అమలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అయినవిల్లి మండలం నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాజెక్టులు దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఈ మూడు ప్రాజెక్టులు 2024 జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ విజయవాడలో జరగనున్న దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రదర్శితమవుతాయని తెలిపారు. సోలార్ సెన్సార్ కాలిట్ షెడ్, ఈజీ మిషన్స్ ఇన్ అవర్ డైలీ లైఫ్, ఫ్యూచర్ రోడ్స్ ఫర్ డవలప్ ఇండియా ఈ మూడు అంశాల్లో ఆ మూడు పాఠశాలల ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాయన్నారు. ఆ మూడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను డీఈవో ఎం.కమలకుమారి, డీవైఈవో ఎస్ఎల్ నరసింహఫణి అభినందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా ప్రాజెక్టులు పంపిన జిల్లాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముందు వరసలో ఉండడం అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు.

పేదల చదువుకు సర్కారు వెన్నుదన్ను

- జేసీ నుపూర్ అజయ్
- నాలుగో విడత విద్యాదీవెన పంపిణీ

సాక్షి అమలాపురం: పాఠశాల స్థాయి నుంచి విదేశీ విద్య వరకు పేదలు, మధ్య తరగతి వారికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, విదేశీ విద్యాదీవెన వంటి విశిష్ట కార్యక్రమాల అమలు ద్వారా నర్సరీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 2023 నుంచి సెప్టెంబర్ 2023 వరకు నాలుగో విడత జగనన్న విద్యా దీవెన నిధులను బటన్ నొక్కి నేరుగా తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాకు జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో జేసీ నుపూర్ అజయ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యా విధానంలో అతి పెద్ద సామాజిక మార్పునకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందన్నారు. పేద పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తున్నారన్నారు. నాలుగో దశలో భాగంగా ఎస్సీ విద్యార్థులు 9,568 మందికి రూ.7,04,40,994, ఎస్టీ విద్యార్థులు 137మందికి రూ.7,47,575, బీసీ వర్గానికి చెందిన 10,134 మందికి రూ.7,25,70,482, ఈబీసీ వర్గాలకు చెందిన 1,842 మందికి రూ.1,70,54,296, కాపు వర్గానికి చెందిన 6,176 మందికి రూ.4,86,32,732




విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న జేసీ నుపూర్ అజయ్, పురపాలక సంఘ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, హితకారిణి సమాజం చైర్మన్ బాల మునికుమారి

లు, ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన 239 మందికి రూ.20,54,059, క్రిస్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన 123 మందికి రూ.9,96,548, వెరసి జిల్లావ్యాప్తంగా 28,219 మంది విద్యార్థులకు రూ.21,24,96,686 జమ చేశారని జేసీ నుపూర్ అజయ్ తెలిపారు.

పురపాలక సంఘ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ప్రసంగిస్తూ తరగతి గదులలో డిజిటలైజేషన్ ప్రవేశపెడుతున్నారని, సీబీఎస్ఈ సిలబస్, ద్విభాషా పాఠ్య పుస్తకాలు, సబ్జెక్ట్-టీచర్ కాన్సెప్ట్, బైజుస్ కంటెంట్ ట్యాబ్‌ల పంపిణీ వంటి విప్లవాత్మకమైన కార్యక్రమాల ద్వారా విద్యాబోధన జరుగుతోందన్నారు. హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి మాట్లాడుతూ పేద విద్యార్థులకు బీటెక్, ఎంబీబీఎస్ వంటి ఉన్నత విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ పథకం సహాయంతో చదువుకొని ఎందరో ఉన్నత విద్యావంతులై తమ జీవితాలతోపాటు తమ కుటుంబాలు ఉన్నతంగా ఎదిగేలా చేసుకున్నారన్నారు. అదేబాటలో జగన్ ముందుకు వెళుతున్నారన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వై.సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం.. ఆంధ్రా అరుణాచలం

- సత్సంగం, సేవే లక్ష్యంగా రాచపల్లి శ్రీ రమణ సేవాశ్రమం
- నేడు రమణ మహర్షి జయంతి
- విస్తృతంగా ఏర్పాట్లు



రమణ మహర్షి

ప్రత్తిపాడు రూరల్: తమిళనాడులోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం అరుణాచలం . అక్కడ అపీతకుచాంబ సమేతుడై స్వయంభువుగా వెలసిన అరుణాచలేశ్వరుడిని ఎంతో మంది భక్తులు దర్శించుకుంటారు. అక్కడి భగవాన్ రమణ మహర్షి ఆశ్రమాన్ని దర్శించుకుని.. ఆయన చూపిన బాటలో పయనిస్తూ మోక్ష సాధనకు కృషి చేస్తున్న వారు ఎందరో ఉన్నారు. జీవితంలో ఒక్కసారైనా తిరువణ్ణామలై వెళ్లి, గిరి ప్రదక్షిణ చేయాలని తపిస్తున్నవారు ఎందరో. అటువంటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాన్ని తలపించేలా.. ఆంధ్రా అరుణాచలంగా భాసిల్లుతోంది ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని శ్రీ రమణ సేవాశ్రమం. ఇది ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతూ.. మూడు దశాబ్దాలుగా అనేక మందిని ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తోంది. రమణ మహర్షి మార్గంలో పయనిస్తూ సంఘహిత కార్యక్రమాలు చేపడుతోంది. సత్సంగం, సేవ అనే రెండు సాధనాలతో మానవ సంబంధాలను బలోపేతం చేసేందుకు త్రికరణ శుద్ధిగా నిరంతర కృషి చేస్తోంది.

పునాది పడిందిలా..

రాచపల్లికి చెందిన కవల బ్రహ్మచారులు రమణానంద, లక్ష్మణానందలు ఆధ్యాత్మిక సాధన చేస్తున్న క్రమంలో రమణ మహర్షి బోధనలకు ఆర్షితులయ్యారు. వీటి ద్వారా సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో భక్తుల విరాళాలతో 1990 ఆగస్టు 15న 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని రాచపల్లి సమీపాన నాలుగెకరాల స్థలాన్ని సమకూర్చుకుని, ఈ ఆశ్రమం ఏర్పాటు చేశారు. రమణ మహర్షి ప్రధాన ఆలయం, ధ్యాన మందిరం నిర్మించారు. 'ఈ ఆశ్రమాన్ని ఆనుకొని శ్రీ అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయాన్ని, దక్షిణామూర్తి, గణపతి, కుమారస్వామి ఉపాలయాలను కూడా నిర్మించారు. క్రమంగా ఈ ఆధ్యాత్మిక కేంద్రాన్ని అంధ్రా అరుణాచలంగా తీర్చిదిద్దారు.



అరుణాచలేశ్వరస్వామి

నేడు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రమణ మహర్షి 144వ జయంతి వేడుకలు శనివారం ఆశ్రమంలో నిర్వహిస్తున్నారు. దీనికోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. 15 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. సత్యసాయి సేవా సంస్థలు సహా పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సహకారంతో, ఆధ్యాత్మిక వెలుగులతో రమణ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, అఖండజ్యోతి ప్రజ్వలన, సమష్టి ధ్యానం, ఉపనిషత్ పారాయణ, ప్రణవ పతాక ప్రతిష్ఠాపన, గోపూజ, రమణ అష్టోత్తర శతనామావళి అర్చన, లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తారు. అనంతరం 10.30 గంటలకు ఆధ్యాత్మిక సభ జరుగుతుంది.



రాచపల్లి సమీపంలోని శ్రీ రమణ సేవాశ్రమం



అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయం

ఆధ్యాత్మికత, సేవా భావం పెంపొందించడమే లక్ష్యం



సీతానగరం మండలం వంగలపూడిలోని శ్రీ సద్గురు సేవాశ్రమంలో సాధనకు వెళ్లినప్పుడు రమణ మహర్షి తత్వం తెలుసుకుని ప్రేరణ పొందాం. దాతల సహకారంతో రాచపల్లి అడ్డురోడ్డు వద్ద రమణ సేవాశ్రమాన్ని నెలకొల్పాం. సేవ, సత్సంగం సాధనాలుగా సమాజ వికాసం దిశగా భక్తులకు ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా నిర్దేశించుకొన్నాం. మానవ బంధాలు బలపడేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– స్వామి రామానంద, శ్రీ రమణ సేవాశ్రమం అధిపతి, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

క్లుప్తంగా

ఏసీబీ కేసులో పీఆర్ ఈఈకి మూడేళ్ల కారాగారం

రాజమహేంద్రవరం రూరల్: కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకున్న కేసులో పంచాయతీరాజ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బిల్లూరి నరసింహారెడ్డికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో నెలరోజుల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి యుయు ప్రసాద్ శుక్రవారం తీర్పునిచ్చారు. అదేవిధంగా మరో సెక్షన్ కింద మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు తీర్పునిచ్చారు. జరిమానా కట్టలేని పక్షంలో మరోనెలరోజుల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేస్తారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ పంచాయతీరాజ్‌శాఖలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ డివిజన్ ఎగిక్యూటివ్ ఇంజినీర్‌గాను, ఈఈ మెయింటెనెన్స్ డివిజన్‌కు బిల్లూరి నరసింహారెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. కాకినాడ గంగరాజునగర్‌కు చెందిన కాంట్రాక్టర్ అయిన ఫిర్యాదుదారుడు తిబిరిశెట్టి ఉదయకు మార్‌ను నాలుగు సీసీరోడ్డు పనులకు సంబంధించిన బిల్లులను ఆమోదించడం కోసం రూ.7,000 లంచం అడిగాడు. సదరు కాంట్రాక్టరు రాజమహేంద్రవరంలోని ఏసీబీ డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బిల్లూరి నరసింహారెడ్డిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. 2009 డిసెంబర్ 30వ తేదీన నరసింహారెడ్డి ఫిర్యాదుదారుడు ఉదయ్‌కుమార్ నుంచి రూ.7,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కోర్టులో హాజరుపరిచారు. వాదప్రతివాదనలు జరిగాక పైవిధంగా తీర్పునిచ్చారు. నరసింహారెడ్డి 2017లో కడప పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శేషయ్య రాజమహేంద్రవరం ఏసీబీ ప్రాసిక్యూషన్ తరఫున కోర్టులో వాదించగా, రాజమహేంద్రవరం ఏసీబీ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సీహెచ్.సౌజన్య పర్యవేక్షించారు.

విద్యుత్ షిఫ్ట్ ఆపరేటర్ ఆత్మహత్య
ఆర్థిక ఇబ్బందులే కారణం?

నిడదవోలు : పట్టణంలోని ఏపీ ట్రాన్స్‌కో 130 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ షిఫ్ట్ ఆపరేటర్ గంధం వీర వెంకట సత్యనారాయణమూర్తి (48) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నిడదవోలు 130 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 18 ఏళ్లుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య ధనలక్ష్మితోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు రెండు రోజుల నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. విద్యుత్ సబ్ స్టేషన్ అవుట్ పాయింట్ దగ్గర విద్యుత్ టవర్‌కు తాడుతో ఉరి వేసుకుని కనిపించాడు. కార్మికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై పి.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అన్నదాతకు అండగా అజొల్లా

- పంటలకు ఎరువుగా.... పాడి గేదెలకు దాణాగా
- ఉమ్మడి గోదావరి జిల్లాలోని 18 మండలాల్లో సాగు

పెద్దాపురం: వ్యవసాయ పనులకు కూలీల రేట్లు పెరగడం, వారు దొరకకపోవడం, సాగు పనుల్లో యంత్రాల వాడకం వల్ల ఎండుగడ్డికి, కలుపు మందుల వల్ల పచ్చగడ్డికి కొరత ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో 'అజొల్లా' ఒక వరంలా మారింది. పెరిగిన దాణా ఖర్చుల వల్ల పశుపోషణ కష్టంగా మారిన సమయంలో అజొల్లా ఆదుకుంటోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులు ఈ అజొల్లా తయారు చేసి, పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నారు.

విస్తృతంగా ప్రచారం

వ్యవసాయంలో, పశువులు, జీవాలు, కోళ్ల పెంపకంలో అజొల్లా రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది. నాచు జాతికి చెందిన అజొల్లాను ఇంటి ఆవరణలోనే సులభంగా పెంచుకునే అవకాశం ఉంది. పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్), రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం జి.రాగంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, అయినవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ తదితర మండలాల్లో అజొల్లా గురించిన ప్రచారం విస్తృతంగా చేపట్టారు. పెంపకం చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

పెంచుకునే విధానం...

అజొల్లా పెంపకానికి కావలసిందల్లా కొన్ని సిమెంటు లేదా మామూలు ఇటుకలు, ఓ టార్పాలిన్ పట్టా, తాగునీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా. ఈ మొత్తం కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ.1,000.


కోళ్లకు మేతగా అజొల్లా


అజొల్లా సాగుపై రైతుకు అవగాహన కల్పిస్తున్న పీఎం నాగేశ్వరరావు

పాడి-పంట

సిమెంట్ ఒరలు కానీ ఇటుకలతో రూపొందించిన తొట్టిలతో కానీ అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెచ్చుకుని తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు...

- ఆవులకు, గేదెలకు, మేకలకు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- రోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున దాణాగా పెట్టడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతుంది. దీనిలో ప్రొటీన్స్, మాంసకృత్తులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్ఠంగా ఉంటుంది. పశువులు సమయానికి ఎదకి వస్తాయి. దీనివల్ల పశు సంపద పెరుగుతుంది.


అజొల్లా పిట్లు

- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో జల్లుకోవడం వల్ల ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను పొలంలో వేయడం వల్ల మొక్క వేర్లకు ఆక్సిజన్ తగినంత అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- పొలం నిండా అజొల్లా ఉండటం వల్ల నీరు త్వరగా ఆవిరి కాదు. ఫలితంగా నీటితడులు అందించాల్సిన అవసరం చాలా తగ్గుతుంది.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.

పంటకే కాదు... పశువులకూ మేలే



అజొల్లా వేసిన 15 రోజుల నుంచి రోజూ ఒక కేజీ వంతున పాడి పశువులకు దాణాగా వినియోగిస్తున్నాను. పాల దిగుబడే కాకుండా వెన్న శాతం కూడా పెరిగింది. వరి పంటలో కూడా అజొల్లా వేశాను. దీని వల్ల కలుపు నివారణకు దోహదపడింది. యూరియాకు బదులుగా అజొల్లాను ఉపయోగించా. ఎకరాకు రూ. 5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు తగ్గింది.

– కన్నారావు, అజొల్ల సాగు రైతు, జి.రాగంపేట, పెద్దాపురం మండలం

అవగాహన కల్పించాం



అజొల్లా ప్రతీ రైతు ఇంట్లో పెంచుకోవాలి. దీనివల్ల రైతులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం అవసరం ఉండదు. కానీ కాస్త శ్రద్ధ తీసుకోవాలి. అజొల్లా పెంపకం పట్ల 18 మండలాల్లోని రైతులకు అవగాహన కల్పించాం. సాగుకు రైతులకు సలహాలు అందిస్తున్నాం. కేవలం రూ.1,000 పెట్టుబడితో నిరంతరాయంగా అజొల్లా తయారవుతుంది. రైతులు కూడా అజొల్లా పట్ల ఆకర్షితులవుతున్నారు.

– బర్రే నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ ఫౌండేషన్, గోరింట, పెద్దాపురం మండలం

'మద్యం'తరంగా పట్టివేత

- యానాం నుంచి అనకాపల్లి అక్రమంగా తరలించే యత్నం
- గుట్టురట్టు చేసిన కోరంగి పోలీసులు
- 109 బాటిళ్లు, కారు, మూడు మొబైల్స్ సీజ్


కోరంగి పోలీసులు పట్టుకున్న అక్రమ మద్యం

తాళ్లరేవు: కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నుంచి అనకాపల్లికి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కోరంగి పోలీసులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. కోరంగి ఎస్సై శనగొట్టి రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు జాతీయ రహదారి 216లోని సుబ్బారాయుని దిమ్మ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నామన్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక గ్రామానికి చెందిన దాడి వినోద్, పెంటకోట హరీష్, మల్ల తేజ, వేగి సాయి యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా కారులో తరలిస్తుండగా పట్టుకుని రూ.50 వేల విలువ చేసే 109 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యాన్ని తరలిస్తున్న రూ.6 లక్షల విలువ చేసే కారు, మూడు మొబైల్స్‌ను సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎస్సై రవికుమార్‌తోపాటు సిబ్బంది చిట్టిబాబు, సురేష్, సూర్యచంద్ర పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశం
- ప్రత్యేక అధికారులతో సమావేశం

కాకినాడ: కాకినాడలో వచ్చే నెల 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సీఎం సభ జరగనున్న ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను వివిధ విభాగాల అధికారులతో కలసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సభావేదిక వద్ద పారిశుధ్యం, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. పింఛన్ సొమ్మును రూ.2,750 నుంచి రూ.3 వేల పెంపుదల చేసే కార్యక్రమాన్ని సీఎం కాకినాడ నుంచి ప్రారంభిస్తారన్నారు. ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో జరిగే సభలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు, పింఛనుదారులు కూడా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను కూడా సీఎం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీపీ శిరిల్, ఈఈలు వెంకటరావు, మాధవి, ఏఓ శిరీష్, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


ఆర్ఎంసీ గ్రౌండ్‌ను పరిశీలించి సూచనలు ఇస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

భవానీ పాదయాత్ర బృందాన్ని ఢీకొన్న లారీ

- ఒకరి మృతి
- మరో నలుగురికి గాయాలు


మృతుడు గొర్లె నానాజీ (ఫైల్)

నల్లజర్ల: విజయవాడ కనకదుర్గమ్మ చండీహోమానికి వెళుతున్న భవానీ మాలధారుల బృందాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నల్లజర్ల మండలం అనంతపల్లి–అచ్చన్నపాలెం గ్రామాల మధ్య శుక్రవారం తెల్లవారు జామున ఈ ప్రమాదం జరిగింది. యలమంచిలి శివారు అగ్రహారానికి చెందిన గొర్లె నానాజీ, మాటూరి లక్ష్మణరావు, గొర్లె అచ్చింనాయుడు, గొర్లె శ్రీను, ఎస్.లక్ష్మణరావు భవానీ మాలలు ధరించి ఈ నెల 23న ఇరుముడులు కట్టుకొని పాదయాత్రగా బయలు దేరారు. శుక్రవారం తెల్లవారుజామున అనంతపల్లి–అచ్చన్నపాలెంల మధ్య ఈ బృందాన్ని విజయవాడ వెళుతున్న మినుముల లోడు లారీ ఢీకొంది. ఈ ఘటనలో నానాజీ(29)అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా నలుగురుకి తీవ్ర గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో వారందరినీ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తాడేపల్లిగూడెం తరలించారు.


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ బృందం

పోటాపోటీ

- ఉత్సాహంగా కేఎస్‌పీఎల్ సిల్వర్‌జూబ్లీ బ్యాడ్మింటన్ మ్యాచ్‌లు
- ఏపీ, తెలంగాణ నుంచి 500 మంది హాజరు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ సీపోర్ట్సు ప్రైవేట్ లిమిటెడ్ సిల్వర్‌జూబ్లీ అంతర రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం రెండవ రోజు కాకినాడ ద్రోణ అకాడమీలో ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లను ఒలింపిక్ సంఘ సీఈఓ చంద్రుగోవిందరాజు, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కాకినాడ సీపోర్ట్సు సీఓఓ ఎం.మురళీధర్ ప్రారంభించారు. అండర్–13 బాలురు, బాలికలు, అండర్–17 బాలురు, బాలికలు సింగిల్స్‌లో పోటీలు జరిగాయి. అండర్–13లో చదరం హంసిని, ఎన్.సాహితీ శ్రీ, కె.ఉషశ్రీ, బాలుర విభాగంలో కె.సాత్విక్, ఎ.సుహాస్, జి.నిఖిల్ వర్మ మొదటి మూడు స్థానాలు అందుకున్నారు. అండర్–17 బాలికల విభాగంలో కె.హాసిని వర్మ, కె.ఉషశ్రీ, బి.అపర్ణ, బాలుర విభాగంలో వెంకట ప్రణీత్, టి.చరణ్ రామ్, టి.కౌశిక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు అందుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథి కర్రిభామిరెడ్డి, సీపోర్ట్సు సీఓఓ మురళీధర్ బహుమతులు అందజేశారు. ఈ పోటీలను జాతీయస్థాయి రిఫరీ పాయాసం శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు, పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు బి.కృష్ణమూర్తి, డీఏఎస్ ప్రసాద్‌వర్మ, బాపిరాజు, కె.పురుషోత్తం, ద్రోణా అకాడమీ నిర్వాహకులు మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపోర్ట్సు ఓసీసీ మురళీధర్ మాట్లాడుతూ సీపోర్ట్సు సిల్వర్ జూబ్లీ సందర్భంగా మెగా బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతీ కేటగిరిలోను కప్‌తోపాటు ప్రైజ్‌మనీ అందిస్తున్నామన్నారు. శనివారంతో ముగియనున్న ఈ పోటీలలో ఏపీ, తెలంగాణ నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.


అండర్-13 విభాగంలో విజేతలతో సీపోర్ట్సు సీఓఓ మురళీధర్ తదితరులు

త్రికాలలోనూ నశించనిది సత్యం

సామవేదం షణ్ముఖశర్మ



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఒకోసారి నాస్తికవాదం, వేదాంతం ఒకేలా కనపడవచ్చును. కానీ త్రికాలలోనూ నశించనిది సత్యం అని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో శుక్రవారం 17వ రోజు ప్రవచనంలో సామవేదం షణ్ముఖశర్మ జాబాలి వాదనలను రాముడు ఖండించిన తీరును వివరించారు.

'ఈ లోకంలోకి ఏ ప్రాణి అయినా ఒంటరిగా వస్తాడు, ఒంటరిగా వెళ్లిపోతాడు, ఎవరికి ఎవరూ ఏమీ కారని' జాబాలి రామునితో చెబుతాడు. అయోధ్యకు రాముని తిరిగి తీసుకువెళ్లాలన్న సంకల్పంతో జాబాలి వేదశాస్త్ర విరుద్ధమైన వాదనలు వినిపిస్తాడు. 'నీ తండ్రి ఇప్పుడు లేడు. నీవు తరతరాలుగా వస్తున్న రాజ్యాన్ని వదలి అడవి బాట పట్టడం వ్యర్థం. పిండ ప్రదానంలోని అన్నం మన కళ్లముందే శిథిలమవుతోంది కదా! ఇది పితరులకు ఎలా చేరుతుంది? ఇదే నిజమైతే, దూరప్రాంతాలకు వెళ్లేవారికి ఆహార పదార్థాలు ఇవ్వడం ఎందుకు? వారిని ఉద్దేశించి పిండ ప్రదానం చేస్తే సరిపోతుంది కదా? యజ్ఞ యాగాలు, దాన ధర్మాలు, శ్రాద్ధాదులు ఇవన్నీ సంపన్నుల నుంచి ధనం గ్రహించడానికే నిర్దేశించిన ప్రక్రియలు. ధర్మం పేరుతో సుఖభోగాలను పరిత్యజించడం వ్యర్థం' అని జాబాలి అంటాడు. ఒకోసారి నాస్తికవాదం, వేదాంతం ఒకేలా కనపడవచ్చును. కానీ, వేదాంతం, ధర్మం ముసుగులో జాబాలి చేసిన చార్వాక వాదనలను రాముడు ఖండిస్తాడు. 'నాకు ప్రియం కలిగించడానికి నీవు వినిపిస్తున్న మాటలు ధర్మ విరుద్ధమైనవి, పథ్యంలా కనపడే అపథ్యం, హితంలా కనపడే అహితం నీ మాటలు. నేను ఇచ్చిన మాటను నేనే తప్పితే, ఇతరులు ఎవరికి నేను ఉపదేశించగలను? రాజు ధర్మం తప్పితే ప్రజలు ధర్మం తప్పుతారు. త్రికాలలోనూ నశించనిది సత్యం. తండ్రి జీవించి ఉండగా ఇచ్చిన మాటను ఆయన గతించిన వెంటనే తప్పడం అధర్మమే' అని రాముడు స్పష్టం చేస్తాడు. తను అయోధ్యకు రమ్మని ఒత్తిడి చేస్తున్న భరతునితో మన తండ్రి ఒట్టుపెట్టి కైకకు ఇచ్చిన మాటను నిలబెట్టవలసిన బాధ్యత మన ఇద్దరి మీదా ఉంది. తండ్రిని మనం సత్యవాదిని చేయాలి, ఆయనకు అసత్యదోషం రాకుండా కాపాడటమే పుత్ర ధర్మమని రాముడు భరతునికి చెబుతాడు. సత్యాన్ని మించిన తపస్సులేదని ఆయన భరతునికి ఉపదేశిస్తాడు. రాముని ప్రతీవాక్యం ఒక ఉపదేశం, రామాయణ కావ్యమే ఒక మహోపదేశమని సామవేదం వివరించారు.

గోపాలపురం ఎంపీడీఓ శ్రీదేవి సస్పెన్షన్



దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆర్.శ్రీదేవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున సస్పెన్షన్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు హిజ్రాల అరెస్ట్

డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం సావరం బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు స్నేహితులను ఆపి వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు కాజేసిన నేరంపై ఇద్దరి హిజ్రాలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు హిజ్రాలు విశాఖ జిల్లా వి.మాడుగుల మండలం కోండ్లపాడుకు చెందిన జనిపిరెడ్డి ప్రజ్ఞ, కాకినాడ జిల్లా రేచర్లపేటకు చెందిన వారా వెంకట లోవరాజు అనే నిత్యలను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని చెప్పారు. పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై కె.ఎం.జోషి ఈ కేసును నమోదు చేసి దర్యాప్తు చేశారని తెలిపారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు.

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం

ముగిసిన ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు

కాకినాడ సిటీ: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలో భాగంగా భవిష్యత్తు పోరాటాలకు ఎస్ఎఫ్ఐ సిద్ధమవుతుందని, విద్యార్థులంతా కలిసి రావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభల సందర్భంగా శుక్రవారం కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ బీజేపీ ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానంపై మండిపడ్డారు. డార్విన్ సిద్ధాంతాన్ని, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి బీజేపీ తొలగిస్తోందన్నారు. రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా విద్యార్థులు నగరంలోని ఆనంద భారతి గ్రౌండ్ నుంచి మెయిన్‌రోడ్డు, సాలిపేట హైస్కూల్, పిండాల చెరువు మీదుగా మెక్లారిన్ హైస్కూల్ వరకు ప్రదర్శన చేశారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత పూర్వ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు వరహాలు పాల్గొన్నారు.


కాకినాడలో విద్యార్థుల ప్రదర్శన